Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.com సంపుటి :2 సంచిక: 48 హైదరాబాద్ 09 శనివారం, నవంబర్ 2024 పేజీలు: 8 రూ.3/-


## ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో విచారణ

### విచారణ 11కు వాయిదా వేసిన కోర్టు

**హైదరాబాద్,నవంబర్8(తెలంగాణ వీణ):**

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన కేసులో హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. అనంతరం కేసు విచారణను 11వ తేదీకి వాయిదా వేవారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌పై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. భారాస తరఫున సీనియర్ న్యాయవాది మోహన్‌రావు వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదన్నారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌కు విచారణ అర్హత లేదన్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు పలు కోర్టుల తీర్పులను మోహన్‌రావు చదివి వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది.

వివరాలు 2లో



# మూసీ పునరుజ్జీవన పాదయాత్రకు శ్రీకారం





### సంగెం మూసీనది ఒడ్డున శివలింగానికి ప్రత్యేక పూజలు సిఎం వెంట నడిచిన పలువురు మంత్రులు

**యాదాద్రి భువనగిరి,నవంబర్8 (తెలంగాణ వీణ):**

మూసీ పునరుజ్జీవన పాదయాత్రను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. సంగెంలోని మూసీనది ఒడ్డున ఉన్న శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రను మొదలుపెట్టారు. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం నుంచి భీమలింగం వరకు సుమారు 2.5 కి.మీ మేర పాదయాత్ర కొనసాగనుంది. మూసీ పునరుజ్జీవ యాత్రలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ , కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు సీఎం వెంట ఉన్నారు. వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్ పాదయాత్ర చేపట్టారు. సంగెం నుంచి భీమలింగం వరకు 2.5 కిలోమీటర్ల పాదయాత్ర చేయనున్నారు. స్థానిక రైతుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. భీమలింగం నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కెనాల్ కట్ట వెంబడి ఈ పాదయాత్ర సాగనుంది. వలిగొండ మండలం సంగెం భీమలింగం కత్వాలో భీమలింగానికి అభిషేకం చేసి సీఎం ప్రత్యేక పూజలు చేశారు.

## గురుకులల్లో విద్యార్థులు చస్తుంటే బర్త్‌డే వేడుకలా

### బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

రేవంత్ రెడ్డి బర్త్ డే వేడుకలు అన్ని గురుకుల పాఠశాలల్లో అధికారికంగా నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పడాన్ని ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఉపాధ్యక్షుడు తుంగబాలు, రఘురాంతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా పని చేసిన పొన్నం ప్రభాకర్‌కు నిబంధనలు తెలియవా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బర్త్ డే వేడుకలు గురుకుల పాఠశాలల్లో ఎందుకు చేయాలన్నారు.

వివరాలు 2లో



### కాంగ్రెస్‌ను దేశం పూర్తిగా

# తిరస్కరించింది

### మహా ప్రచారంలో ప్రధాని మోడీ

**నాసిక్,నవంబర్8(తెలంగాణ వీణ):**




కాంగ్రెస్ పార్టీని యావత్ దేశం పూర్తిగా తిరస్కరించిందని ప్రధాని మోడీ మరోమారు ఘాటుగా విమర్శించారు. అందుకు ఆ పార్టీ చర్యలే కారణమని మోడీ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ ఇప్పుడు ఆల్ ఇండియా కాంగ్రెస్ కాదన్న మోదీ.. పరాన్నజీవి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. ఊత కర్రల సాయంతోనే మనుగడ సాగిస్తోందని విమర్శించారు. శుక్రవారం నాసిక్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్.. ఇలా ఏ రాష్ట్రంలో చూసినా కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలపై ఆధారపడే పోటీచేసే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు ఉన్న చోట కుంభకోణాలేనంటూ విరుచుకుపడ్డారు. ఈ పార్టీలేవీ రాజ్యాంగం, కోర్టులు, ప్రజల మనోభావాలను సైతం పట్టించుకోవన్నారు. కేవలం షో చేయడానికే కాంగ్రెస్ నేతలు రాజ్యాంగం పుస్తకాన్ని జేబుల్లో పెట్టుకొని తిరుగుతుంటారని ఎద్దేవా చేశారు. తన నాయకత్వంలో ఏర్పాటైన ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 25 కోట్ల మంది ప్రజలకు పేదరికం నుంచి విముక్తి కల్పించామన్నారు.కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేశామన్న మోదీ.. తద్వారా 'ఒకే దేశం-ఒకే రాజ్యాంగం' స్ఫూర్తి వాస్తవిక రూపం దాల్చిందని తెలిపారు.

### బీజేపీ తీరుతో దేశం

# సర్వనాశనం

### రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు

**సిమ్లా, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**



కేంద్రంలోని బీజపీ సర్కారు తీరుపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ తీరువల్ల దేశం సర్వనాశనం అయ్యిందన్నారు. మణిపూర్ గురించి చెప్పాలంటే మణిపూర్‌ను వాళ్లు (బీజేపీ) పూర్తిగా తగులబెట్టారని విమర్శించారు. ఇప్పటికీ మణిపూర్ పాలకులు బీజేపీని తగులబెడుతూనే ఉన్నారని మండిపడ్డారు. మణిపూర్‌లో రోజుల తరబడి హింస చెలరేగినా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నదని రాహుల్ గాంధీ మండిపడ్డారు. కనీసం దేశ ప్రధాన మంత్రి కూడా మణిపూర్‌ను సందర్శించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని రాష్ట్రాలు తిరుగుతున్న ప్రధాని మణిపూర్‌కు వెళ్లడం లేదంటే.. మణిపూర్ అంత దుస్థితిలో మరో రాష్ట్రం లేదని బీజేపీ ఒప్పుకున్నట్లేనని రాహుల్ అన్నారు.బీజేపీ వ్యవహారశైలివల్లే మణిపూర్ కొన్ని నెలలపాటు నిప్పుల కొలిమిలా రగిలిపోయిందని అన్నారు. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ సిమ్‌దెగాలో ఏర్పాటు చేసిన సభలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. జార?ండ్‌లో ఈ నెల 13, 20 తేదీల్లో రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 23న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

### నీ మూసీ దాహానికి అత్తాపూర్

# ఆగం..ఆగం

### మోకాలికి దెబ్బ తగిలితే..

### బోడి గుండకు కుట్లు వేసినట్లు గుంపు మేస్త్రీ పాలన

### గోల్నాక గొల్లుమంది.. దిలుసుఖ్‌నగర్ ఢీలా పడ్డది

### ఎక్స్ వేదికగా రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

**అమరావతి, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ యాత్రపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మోకాలికి దెబ్బ తగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు గుంపు మేస్త్రీ పాలన తీరు ఉందని విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ బాధితులు ఉంటే.. నల్లగొండలో మూసీ పరివాహక ప్రాంత రైతులను కలవడంలో రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కూల్చిన ఇండ్లెక్కడ, కాలిన కడుపులెక్కడ, నువ్ తిరుగుతున్న ప్రాంతం ఎక్కడ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ మూసీ దాహానికి అత్తాపూర్ ఆగమైందని, గోల్నాక గొల్లుమంటుందని, దిలుషుక్ నగర్ ఢీలా పడిందన్నారు. నీ కుట్రలకు అంబర్ పేట్, అత్తాపూర్ అతలాకుతలం అవుతుంటే.. నీ పుట్టినరోజు వేడుకలు జరుగుతున్నది ఎక్కడని ప్రశ్నించారు.



వివరాలు 2లో

## అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హెూదా కల్పించే కేసులో సుప్రీం నాలుగు తీర్పులు

**న్యూఢిల్లీ, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హెూదా కల్పించే కేసులో .. ఇవాళ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నాలుగు రకాల తీర్పులను వెలువరించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని ఏడుగురు ధర్మాసనం ఈ తీర్పుల గురించి తెలిపింది. ఏఎంయూ కేసులో నాలుగు రకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయని, దీంట్లో మూడు రకాల వ్యతిరేక తీర్పులు ఉన్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. మెజారిటీ తీర్పు తనతో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రా రాసినట్లు సీజే వెల్లడించారు.

వివరాలు 2లో



### జస్టిస్ చంద్రచూడ్‌కు

# ఘనంగా వీడ్కోలు

### 10న పదవీవిరమణ చేయనున్న చీఫ్ జస్టిస్

**న్యూఢిల్లీ,నవంబర్8(తెలంగాణ వీణ):**



భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నవంబర్ 10న పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆయనకు చివరి పనిదినం కావడంతో సుప్రీం ధర్మాసనం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేపటి నుంచి సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్న మాట వాస్తవమని.. అయినప్పటికీ తాను వృత్తిపరంగా పూర్తి సంతృప్తిగా ఉన్నానని చెప్పారు.మరోవైపు సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులలైన సంగతి తెలిసిందే. నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఇదివరకే వెల్లడించారు. 2025 మే 13 వరకు ఆయన సీజేఐగా కొనసాగనున్నారు.



### కనీసం ఒక్కరోజైనా నిర్బంధాలు

# లేకుండా పాలించండి

### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**హైదరాబాద్, నవంబర్ 8 (తెలంగాణ వీణ)**

: సీఎం రేవంత్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కనీసం మీరు పుట్టిన ఈ ఒక్క రోజైనా నిర్బంధాలు, అక్రమ అరెస్టులు లేకుండా పాలన కొనసాగించాలని కోరుకుంటున్నానని చెప్పారు. సీఎం ముఖ్యమంత్రి మూసీ పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, భూపాల్ రెడ్డి సహా ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్టులు చేసినంత మాత్రాన సీఎం పాదయాత్రకు ప్రజల మద్దతు లభించదని విమర్శించారు.

వివరాలు 2లో

Title Code : 12280
Email : telanganaveenaofficial@gmail.com
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..

# సంపాదకీయం

## విద్యా,వైద్యరంగాలపై
# నిర్లక్ష్యం తగదు !

అందరికీ ఉచిత విద్య, వైద్యం అన్నది ఎండమావిగానే మారుతోంది. ఈ రంగాలపై బడ్జెట్ కేటాయింపులు పెంచి బలోపేతం చేద్దామన్న ఆలోచన ఏ ప్రభుత్వానికి ఉండడం లేదు. అదితెలంగాణ కావచ్చు, ఎపి కావచ్చు..విద్యావైద్యరంగాలను అంటరానివిగా చూస్తున్నారు. ఈ రెండు రంగాల బలోపేతంతో వ్యవస్థను మార్చవచ్చు. ప్రజల్లో సామాజిక పరివర్తన తీసుకుని రావచ్చు. కానీ ఏ ప్రభుత్వం కూడా అలా చేయడం లేదు. సర్కార్ బళ్ల గొప్పదనం గురించి పదేపదే చెబుతున్న సిఎం రేవత్రెడ్డి ఇందుకు తగ్గట్లుగా అడుగులు వేయడం లేదు. మేధావులను సంప్రదించడం లేదు. ప్రజలతో చర్చించడం లేదు. గురుకులాల వల్ల తల్లి దండ్రుల ప్రేమకు పిల్లలు దూరం అవుతున్నారంటున్న సిఎం రేవంత్ వీటిని మార్చే అవకాశం ఉన్నా అలా చేయడం లేదు. నిజానికి గతంలో ఉజ్వలంగా వెలిగిన ప్రభుత్వ స్కూళ్లు ఎందుకు వట్టి పోతున్నాయో పట్టించుకోవడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఒకనడా గ్రామాల వైద్య సేవలను తీర్చేవి. కానీ ఇప్పుడవి కనుమరుగు అయ్యాయి. ప్రతి గ్రామంలో స్కూళ్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తే తప్ప గ్రామాలు బలపడవు. అందిరీకి, విద్య, ఆరోగ్యం అందడం లేదని ప్రభుత్వం గుర్తించడం లేదు. పాఠశాలలను అన్నరకాలుగా బలోపేతం చేసి, అక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నా భోజన వసతి కల్పించినట్లు అయితే ఏ సమస్యా రాదు. స్కూళ్లను అన్ని విధాలుగా పటిష్టం చేయకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 28 సమీకృత గురుకులాల ఏర్పాటు పథకం ద్వారా విద్యారంగం బలోపేతం అవుతుందన్న మాటల్లో నిజం లేదు. పాఠశాల స్థాయిలో విద్యను బలోపేతం చేయడం మాని ఇలాంటి గురుకులాలతో అందరికీ విద్యను అందచేయడం సాధ్యం కాదు. ఓ రకంగా చెప్పాలంటే ప్రభుత్వం అందరికీ సమాన విద్య అనే బాధ్యతల నుంచి వైదొలగడంగానే చూడాలి. కేవలం ఈ గురుకులాలతో కాంట్రాక్టర్లను బతికించడం తప్ప మరోటి కాదు. అవే డబ్బులతో గ్రామాల్లో ఉన్న స్కూళ్లను పరిశుభ్రంగా ఉంచుతూ వసతులు కల్పిస్తే అంతకు మించిన సౌకర్యాలు అక్కర్లేదు. ఇంచుమించు గత పదేళ్లుగా కేసీఆర్ అనుసరించిన సామాజిక గురుకులాలకు రేవంత్ ప్రవేశ పెడుతున్న పథాకానికి పెద్దగా తేడాలేదు. గత పదేళ్ళుగా గురుకులాల పేరుతో కేసీఆర్ చేసిన విద్యారంగ విధ్వంసానికి పాల్పడ్డారు. గురుకులాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ప్రచారార్భాటాలతో మభ్య పెట్టారు. వాటి ఫలితమే ఇప్పుడు చూస్తున్న సమస్యలు. గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ మొదలు అన్ని సమస్యలు కెసిఆర్ ప్రభుత్వం కారణంగా చెప్పుకోవాలి. తొలుత కేసీఆర్ కేజీ టూ పీజీ అంటూ ఊదరగొట్టారు. ప్రచారం చేసి తుస్సుమనిపించారు. ఈ క్రమంలో అసలు విద్యను పక్కనపెట్టి కుల ప్రాతిపదికన గురుకులాల ఏర్పాటు చేయడం మూలంగా ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కులాల వారి విద్య వల్ల పిల్లల్లో విభేదాలు రావడం సహజంగానే ఉన్నాయి. కులమతాలకు అతీతంగా అందరికీ విద్య అన్నది కేవలం పాఠశాలల ద్వారానే సాధ్యం. దీనిపై ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టడం లేదు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కూడా నేటికీ ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థలు గ్రామాల్లోకి చొచ్చుకు వచ్చాయి. ఊరూరా కాన్వెంట్ స్కూళ్లకు పంపడం అలవాటు చేసుకున్నారు. మరోపక్క గురుకులాల్లో తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సరైన విద్యా సామర్థ్యాలు అందించడంలో విఫలం కావడం కారణంగా అవి కూడా కళ తప్పాయి. మరోపక్క ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సంఖ్యలో విద్యార్థులు లేక అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తరగతి గదుల్లో కాలక్షేపం చేసే పరిస్థితి కనిపిస్తోంది. ఈ పరిస్థితిని గతంలో విమర్శించిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అయినా దృష్టి పెట్టలేదు. గ్రామాల్లో ఉన్న బడుల్లో సౌకర్యాలు కల్పించి, విద్యార్థుల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాల్సిందిపోయి, ఈ సమీకృత గురుకులాల ఆలోచన చేయడం ద్వారా మొత్తం వ్యవస్థనే ధ్వంసం చేస్తున్నారు. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ పేరుతో ఏవో వేళ్ళ మీద లెక్కపెట్టే పాఠశాలల్ని ప్రారంభించి అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో వంచన చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో విద్యారంగం మరీ కుదేలవడం ఖాయం. పెద్ద సంఖ్యలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల మూతపడడానికి ఇవి తోడ్పడతాయి. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడిచేందుకే పాలక పక్షాలు ఇలాంటి కసరత్తులు అన్నీ చేస్తున్నాయన్న భావన కలుగుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీల మూలంగా గ్రామీణ పేదలు, మురికి వాడల ప్రజలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి ఎందరికి న్యాయం జరుగుతుందీ అనేది ప్రశ్నార్థకమే!? మెరిట్ ప్రాతిపదికన ఏ కొద్దిమందికో అంతర్జాతీయ ప్రమాణాల భ్రమలో విద్యను అందిస్తామని చెప్పి మెజారిటీ వర్గాలకు అన్యాయం చేయడమే జరుగుతుంది. లక్షలాది సంఖ్యలో ఉన్న ప్రభుత్వ విద్యార్థులను గాలికొదిలి తెలివైన వారిని కొందరిని ఎంపిక చేసి మరింత మెరుగైనవారిగా మారుద్దామన్న ప్రయత్నాలు మాత్రం జరుగుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మారుస్తామని ప్రకటనలు ఇచ్చారు. ఆ మేరకు నిబద్ధత కలిగిన ఆకునూరి మురళి లాంటి మాజీ ఐఏఎస్ అధికారిని చైర్మన్‌గా, తెలంగాణా రాష్ట్రంలో విద్యారంగంలో ఎంతో అనుభవం ఉన్న మేధావులను కమిటీ సభ్యులుగా విద్యా సలహా మండలిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అంతవరకు బాగానే ఉంది. మరి ఆ కమిటీ సిపార్స్ లేకుండా విద్యార్థుల సంఖ్యను ఎలా పెంచగలుగు తుందన్నది చెప్పాలి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ పద్ధితో నడవడం మాని, ప్రజలకు అవసరపడే, అందుబాటులో ఉండే స్కూళ్లను బలోపేతం చేయాలి. అలాగే ఆరోగ్యశ్రీతో పనిలేకుండా వైద్యరంగాన్ని బలోపేతం చేయాలి. అప్పుడే సంకల్పం నెరవేరుతుంది.

## మూసీ పునరుజ్జీవన పాదయాత్రకు
# రేవంత్‌రెడ్డి శ్రీకారం

మొదటిపేజీ తరువాయి

బోట్‌లోకి దిగి మూసీ కాలుష్య జలాలను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు.మూసీ పునరుజ్జీవం యాత్రతో మూసీ పరివాహక ప్రజల వద్దకు సీఎం వెళ్లనున్నారు. తన జన్మదినం నవంబర్ 8 నుంచి క్షేత్ర స్థాయి పర్యటనలకు సీఎం రేవంత్ శ్రీకారం చుట్టారు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో వరుసగా జిల్లా పర్యటనలు చేయనున్నారు. యాదాద్రి జిల్లా నుంచి ముఖ్యమంత్రి పర్యటన మొదలైంది. ఇందులో భాగంగా కుటుంబ సమేతంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనార సింహుడిని దర్శించుకుని సీఎం రేవంత్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర సాగనుంది. మల్లన్న సాగర్ నుంచి యాదాద్రి జిల్లాకు మంచినీటి సరఫరా కోసం నిర్మించనున్న పైప్ లైన్ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇటీవల మూసీకి సంబంధించి బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. అధికారంలో ఉన్నప్పుడే బీఆర్ఎస్ నేతలు మూసీ పునరుజ్జీవనం కోసం ప్రయత్నాలు చేయడం, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు కూడా ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా ప్రాజెక్టు కోసం డిజైన్ కూడా చేశారు. మూసీ సుందరీకరణపై సూచనలు ఇవ్వాలని.. అంతేకానీ ఈ ప్రాజెక్టును అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. మూసీ మురికిలో ఉండేందుకు ప్రజలు ఎవరూ సుముఖంగా లేరని అన్నారు. అక్కడున్న వారికి న్యాయం చేసేందుకు సూచనలు ఇవ్వాలని.. అంతే కానీ ఆందోళనలు చేయడం తగదన్నారు. ప్రజలంతా మూసీ ప్రక్షాళనను కోరుకుంటున్నారని తెలిపారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే వాడపల్లి నుంచి తాను చేస్తున్న పాదయాత్రకు కలిసి రావాలని.. నల్గొండ జిల్లా ప్రజలు మూసీ ప్రక్షాళనను కోరుకుంటున్నారా లేదా అని వారినే అడిగి తెలుసుకుందామని సవాల్ విసిరారు. అనట్లుగానే ఈనెల 8 నుంచి మూసీ పునరుజ్జీవన ప్రజా చైతన్య పాదయాత్రను చేసేందుకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారు. అయితే మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. వలిగొండ మండలంలో పలువురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీశ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగానూ పలువురు ప్రముఖులు అభినందనల జల్లు కురిపిస్తున్నారు.

## నీ మూసీ దాహానికి అత్తాపూర్
# ఆగం..ఆగం

మొదటిపేజీ తరువాయి

అయ్యా సంబరాల రాం బాబు.. నీ అన్యాయానికి ఆవేధనలు, ఆవేశాలు, ఆక్రందనలు వినిపిస్తున్నవి, కనిపిస్తున్నవి అక్కడ కాదు.. రా ఇటు వైపు రా ఇక్కడ చెయ్యి నీ పాదాల మీద యాత్ర అంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. తేలు మంత్రం రానోడు పాము కాటుకు మంత్రం ఏసినట్లు.. పాలన తెల్వని నీకు పగ్గాలు అప్పగిస్తే ప్రజల బతుకుల్ల మన్ను పోసినవ్ అంటూ మండిపడ్డారు.“మోకాలికి దెబ్బ తగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు ఉంది గుంపు మేస్త్రీ పాలన తీరు హైదరాబాద్ లో మూసి బాధితులు ఉంటే-నల్గొండలో మూసి పరివాహక ప్రాంత రైతులను కలవడంలో రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు.సీఎం రేవంత్‌కు కేటీఆర్ జన్మదినోత్సవ శుభాకాంక్షలు సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని, మీ ప్రభుత్వ ఏజెన్సీలు ఎప్పుడైనా రావచ్చంటూ ట్వీట్ చేశారు. విచారణకు వచ్చిన సిబ్బందికి చాయ్, ఉస్మానియా బిస్కెట్లు ఇస్తానని తెలిపారు. వారు కోరితే మీ బర్త్‌డే కేక్ కూడా కట్‌చేయిస్తానని చెప్పారు. కాగా, అరెస్టు భయంతో కేటీఆర్ మలేషియా వెళ్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ న్యూస్‌పేపర్ రాసుకొచ్చిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ చేసిన ట్వీట్‌ను ఆయన కేటీఆర్ ట్యాగ్ చేశారు. కేటీఆర్ ప్రతిష్ఠను మసకబార్చేందుకు ఇదంతా చేస్తున్నారని మాకు తెలుసని, జర్నలిజాన్ని జోక్‌గా మార్చవద్దంటూ క్రిషాంక్ అందులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో చాయ్ తాగుతూ ఈ వార్తను చదువుతూ ఉంటారని చెప్పారు.

## సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ
# శుభాకాంక్షలు

**హైదరాబాద్, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రధాని మోదీ పోస్టుకు సీఎం రేవంత్ స్పందించారు. మీ విషెస్‌కు ధన్యవాదాలు అని పేర్కొన్నారు. కాగా, ముఖ్యమంత్రిగా తొలి పుట్టినరోజును జరుపుకుంటున్న రేవంత్ రెడ్డి మరికాసేపట్లో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకోనున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడుతారు. మూసీ పునరుజ్జీవ యాత్రను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు.

## నరసింహ స్వామి దగ్గరికి సీఎం రేవంత్ రెడ్డి
# మోకాళ్ల యాత్ర చేయాలి
### బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**



పాదయాత్ర కాదు ముందు యాదగిరి నరసింహ స్వామి దగ్గరికి సీఎం రేవంత్ రెడ్డి మోకాళ్ల యాత్ర చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి సూచించారు. రేవంత్ రెడ్డి చేసేది పాదయాత్ర కాదు పాపపు యాత్ర, ప్రాయశ్చిత్త యాత్ర, పశ్చాత్తాప యాత్ర అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తెలంగాణ ప్రజలకు ప్రతినిధిగా ఉంటూ ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తానని రైతులకు హామీ ఇస్తూ.. ఏకంగా లక్ష్మీనరసింహ స్వామి మీద ఒట్టేశారని ఏనుగుల రాకేశ్ రెడ్డి గుర్తుచేశారు. రాజ్యాన్ని పాలించే రాజు ఒట్టేసే మాట తప్పితే ఆ ప్రభావం, దైవాగ్రహం ప్రజల మీద పడుతుందని చెప్పారు. అందుకే, తెలంగాణలో గత వర్షాకాలం వర్షాలు ఆలస్యంగా పడ్డాయని అన్నారు. ములుగు అడవులు కూడా ఎన్నడూ జరగని విధంగా విధ్వంసమయ్యాయని.. ధామగుండంలో చెట్లు పోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ నాశనమైందని.. రియల్ ఎస్టేట్ రంగం, వ్యాపారాలు, కొనుగోలు అమ్మకాలు ఎక్కడిక్కడ ఆగిపోయాయని.. మార్కెట్లో రూపాయి తిరిగే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. మూసీ పుట్టిన వికారాబాద్‌లో అడవులు ధ్వంసం చేసి.. మూసీ ప్రవహించే హైదరాబాద్‌లో ఇల్లు కూలగొట్టి వలిగొండలో పాదయాత్ర చేస్తావా అని రేవంత్ రెడ్డిపై ఏనుగుల రాకేశ్ రెడ్డి మండిపడ్డారు. అయినా పాదయాత్ర చేయాల్సింది రైతుల కల్లాల కాడికి, ఛిద్రమైన మా పోచంపల్లి చేనేతల మగ్గాల కాడికి, నిత్యం ఆసుపత్రుల పాలవుతున్న మా గురుకుల విద్యార్థుల దగ్గరకు అని అన్నారు. ప్రజల మద్దతు ఉంటే మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఎందుకు అక్రమంగా అరెస్టు చేస్తున్నావని ప్రశ్నించారు. ప్రజలు నిలదీస్తారని ఈ కథలు పడుతున్నావ్.. దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా పాదయాత్ర చేయాలని డిమాండ్ చేశారు.

# అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హోదా కల్పించే కేసులో

మొదటిపేజీ తరువాయి

జస్టిస్ సూర్యకాంత్, దీపాంకర్ దత్త, సతీశ్ చంద్ర శర్మలు సపరేట్ తీర్పులను ఇచ్చినట్లు జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. విద్యా సంస్థ నియంత్రణ, పరిపాలన విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేసినా.. ఆ విద్యాసంస్థకు ఉన్న మైనార్టీ హోదాను రద్దు చేయరని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. పార్లమెంట్ చట్టంతో అలీఘడ్ ముస్లిం వర్సిటీ మైనార్టీ హోదా రద్దు అయినట్లు 1968లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టిపారేస్తున్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. అడ్మినిస్ట్రేషన్‌లో మైనార్టీ సభ్యులు లేనంత మాత్రాన.. ఆ వర్సిటీ మైనార్టీ హోదా పోదు అని సుప్రీంకోర్టు చెప్పింది.

## గురుకులల్లో విద్యార్థులు చస్తుంటే
# బర్తుడే వేడుకలా

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో అన్ని గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు దవాఖాన పాలు అవుతున్నారు. ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా కూడా గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రివ్యూ చేయలేదని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురి అయ్యారు. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను చంపడమే కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడమా? అని నిలదీశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే గురుకుల పాఠశాలలకు పర్మినెంట్ బిల్డింగ్స్ కట్టాలన్నారు. గురుకుల పాఠశాలలకు ప్రభుత్వం నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో సమస్యలు అడిగి తెలుసుకుంటామని, సమస్యల దరఖాస్తులను కేటీఆర్, ప్రభుత్వానికి ఇస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వ్యవస్థలను కుప్పకూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


## కనీసం ఒక్కరోజైనా నిర్బంధాలు
# లేకుండా పాలించండి

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి మూసీ పాదయాత్ర హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ మురికి కూపంగా మారడానికి 50 ఏండ్ల కాంగ్రెస్ పాలన కారణం కదా అని ప్రశ్నించారు. పాదయాత్ర కాదు, పాప పరిహారయాత్ర చేసినా మీ కాంగ్రెస్ పార్టీ పాపం పోదన్నారు. . పేదల గూడు కూల్చింది ఒక దగ్గర, పాదయాత్ర చేసేది మరొక దగ్గరని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఇండ్లు కూల్చి, నల్లగొండలో పాదయాత్ర చేస్తారా అని నిలదీశారు. దమ్ముంటే.. హైదరాబాద్ నుంచి పాద యాత్ర మొదలు పెట్టాలని సవాల్ విసిరారు. మీ పాదయాత్రకు ప్రజల మద్దతే ఉండి ఉంటే, ఈ నిర్బంధాలు, అక్రమ అరెస్టులు ఎందుకని రేవంత్ రెడ్డిని నిలదీశారు. మీ 11 నెలల పాలనే కాదు, మీ పాదయాత్ర కూడా నిర్బంధాల మధ్య కొనసాగుతుండడం దురదృష్టకరమంటూ విమర్శించారు. అరెస్టులు, అక్రమ నిర్బంధాలు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సీఎం కోసం ఉంచిన
# సమోసాలు మాయం
## సంఘటనపై విచారణ

**సిమ్లా, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**





అక్టోబర్ 21న సీఐడీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమానికి సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐడీ అధికారులతో కలిసి ఆయన టీ తాగారు. అయితే సీఎంకు సర్వ్ చేసేందుకు ప్రత్యేకంగా ఉంచిన మూడు బాక్సుల సమోసాలు మాయమయ్యాయి. దీంతో సీఐడీ అధికారులు గందరగోళానికి గురయ్యారు. కాగా, సీఐడీ కార్యాలయంలోని మహిళా అధికారిణి ఆ సమోసాల బాక్సులను సీఎం భద్రతా సిబ్బందికి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో సీఎం కోసం ఉంచిన ఆ సమోసాలు వారు తిన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సీఐడీ అంతర్గత దర్యాప్తు జరుపుతోంది. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతిపక్షమైన బీజేపీ దీనిపై విమర్శలు గుప్పించింది. సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖు కోసం ఉంచిన సమోసాలు మాయం కావడంపై సీడీఐ దర్యాప్తు చేస్తున్నట్లుగా సోషల్ మీడియాలో ఆరోపించింది. అయితే సీఐడీ దీనిని ఖండించింది. కేవలం అంతర్గతంగా ఆరా తీసినట్లు సీఐడీ డీజీ తెలిపారు. సీఎంవో కార్యాలయం కూడా ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టింది. బీజేపీకి ఏ సమస్యలు కనిపించకపోవడంతో ఈ అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నదని మీడియా ప్రధాన సలహాదారుడు నరేష్ చౌహాన్ విమర్శించారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు..





**తెలంగాణ వీణ/ఓయూ:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఓయూలో కార్మికులకు ఓయూ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ మరియు కాంగ్రెస్ సేవాదళ్ నాయకుడు సయ్యద్ రజాక్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ ఫౌండర్ ప్రెసెంట్ ఓయూ రీసెర్చ్ స్కాలర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వలిగొండ నరసింహ మాట్లాడుతూ.ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినాక అనేక చారిత్రక సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగింది. రైతులకు రుణమాఫీ చేయడం , 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ,మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు సదుపాయం,500 రూపాయలకే సిలిండర్ ఇవ్వడం, విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పుల కోసం మొన్నటికి మొన్న గురుకుల విద్యార్థుల మెస్ ఛార్జీలు 40% పెంచడం, విద్యా వ్యవస్థలో సమూల మార్పుల కోసం 1100 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల ఏర్పాటు ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యా వ్యవస్థలను ఏర్పాటు. అంతేకాకుండా త్వరితగతిన ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలు నియామకం, విశ్వ విద్యాలయాలకు యుద్ధ ప్రాతిదికన వైస్ చాన్సలర్ లను నియమించడం .. ఆరోగ్య శ్రీ పథకం యొక్క పరిమితిని 10 లక్షలకు పెంచడం లాంటి కార్యక్రమాలతో వైద్యం, విద్య ఉపాధి అవకాశాలపై శ్రద్ధ చూపెడుతున్నారు. కుల వృత్తుల ఆధారంగా వివిధ కులాలకు నూతన కార్పొరేషన్ లు ఏర్పాటు చేయడం. ఎస్సి సబ్ ప్లాన్ చట్టంను అమలు పర్చడం, అలాగే ఎన్నో ఏండ్లుగా అమలు కానీ ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు విలువరించిన నేపథ్యంలో వర్గీకరణ అమలు ప్రక్రియలో భాగంగా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సింగిల్ మెన్ కమిషన్ ను నియమించడం, సమగ్ర కులగణన లాంటి బృహత్తర కార్యక్రమం చేపట్టడం లాంటివి రేవంత్ రెడ్డికి ప్రజల సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధి అంకిత భావంను నేడు రేవంతన్న గుర్తు చేయడం జరుగుతుంది... సాధారణ కార్యకర్త స్థాయి నుండి నేడు ముఖ్యమంత్రి స్థాయి వచ్చే వరకు పోరాట స్ఫూర్తిని కనబర్చిన రేవంత్ అన్న జీవితం మాలాంటి మొదటి తరంనుండి వచ్చిన విద్యార్థి నాయకత్వానికి ఒక స్ఫూర్తిదాయకమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ ఖైరతాబాద్ డిస్టిక్ అధ్యక్షుడు సయ్యద్ రజాక్, ఓయూ విద్యార్థి నాయకులు శంకర్ యాదవ్, అభిలాష్, వేముల సురేష్, ప్రవీణ్, అనిల్, నందు, వెంకట్ ముదిరాజ్ , సల్మాన్, సలీం, షోయబ్, జావేద్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పేర్ల బాలు, కొమ్మనబోయిన సైదులు యాదవ్, రెడ్డి శీను ముదిరాజ్ స్కాలర్స్, విద్యార్థులు భారీ ఎత్తున పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఓయూలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కు నోటు బుక్స్ పంపిణీ

**తెలంగాణ వీణ/ఓయూ:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనదినోత్సవం ను పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీలో గల జమై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలలో గల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు మరియు బిస్కెట్స్ పంపిణీ చేసిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు మరియు యూనివర్సిటీ లను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి గారు ఇటీవల విద్యార్థుల యొక్క డైట్ మరియు కాస్మొటిక్ చార్జీలను నలబై శాతం పెంచారని గుర్తు చేశారు. అంతేకాకుండా సమీకృత గురుకులాలను తీసుకువచ్చి పర్మినెంట్ బిల్డిగులను నిర్మిస్తున్నారు. అంతేకాకుండా ఈ మధ్యనే ప్రభుత్వ యూనివర్సిటీ లకు వైస్ ఛాన్సలర్లను నియమించారని అన్నారు. రాష్ట్రంలో ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మరియు యూనివర్సిటీలో శాశ్వత అధ్యాపకుల నియామకానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసారు. ఈ విధంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ప్రక్షాలనకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పాపారావు (ఎవిఎస్), అరుణ్,నేరెళ్ల చరణ్, ఉమేష్ నాయక్, శ్రీనాథ్, నవీన్, శ్రీనివాస్, ప్రవీణ్, ప్రశాంత్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## ఓయూ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**తెలంగాణ వీణ/ఓయూ:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టిన రోజును తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ తరుపున ఉస్మానియా యూనివర్సిటీ లో రేణుక ఎల్లమ్మ మాత ఆలయంలో రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో తెలంగాణ ప్రజలకు మరియు యూనివర్సిటీ ల అభివృద్ధికి కృషి చేయాలనీ పూజలు చేసి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు యూనివర్సిటీల పై నిర్లక్షంగా వ్యవహారించారని తెలంగాణ రాష్ట్రం లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ అందరిని రెగ్యులరైజ్ చేసి యూనివర్సిటీ లలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ కి మాత్రం అన్యాయం చేశారు. కాంగ్రెస్ ప్రజాపాలన లో నైనా యూనివర్సిటీ లలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ ని రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని సీఎం ని కోరడం జరిగింది. అన్ని యూనివర్సిటీ లలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ కి రీసెర్చ్ చేయడానికి మరియు పీహెచ్డీ విద్యార్థులకు గైడ్ చేయలేకపోవడం వలన యూనివర్సిటీ లు కుంటుపడుతున్నాయని అందువలన కాంట్రాక్టు టీచర్స్ ని రెగ్యులరైజేషన్ చేయాలని అందుకు ఎక్కువ సమయం అయ్యేట్టువుంటే తక్షణమే ఉద్యగభద్రతతో కూడిన యూజీసీ పే స్కేల్ ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ రేష్మా రెడ్డి, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ రమేష్, డాక్టర్ శేఖర్ రెడ్డి,డాక్టర్ రామలింగయ్య, డాక్టర్ ఉదయ్,డాక్టర్ వాణి, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ కిరణ్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ అశోక్,డాక్టర్ అజయ్ పాల్గొన్నారు.





# పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

**తెలంగాణ వీణ/యాదగిరి గుట్ట:**



యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక ఎక్స్ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బి. శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పంచారామ క్షేత్రాలైన అమరావతి( అమరలింగేశ్వర స్వామి), భీమవరం(సోమేశ్వర స్వామి), పాలకొల్లు( క్షీర లింగేశ్వర స్వామి), ద్రాక్షారామం( భీమేశ్వర స్వామి), సామర్లకోట (భీమలింగేశ్వర స్వామి) క్షేత్రాలకు నవంబర్ నెల 10,17,24 తేదీల్లో(ప్రతి ఆదివారం సాయంత్రం 6 గంటలకు) యాదగిరిగుట్ట బస్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఒకే రోజు పంచారామ క్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా నవంబర్ నెల 15 వ తేది కార్తీక పౌర్ణమి సందర్భంగా 14వ తేది సాయంత్రం 6 గంటలకు కూడా ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. మరియు కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 13న తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు తెలిపారు. పంచారామాలకు ఎక్స్ప్రెస్ బస్సు చార్జీలు: పెద్దలకు రూ.2000, పిల్లలకు రూ.1300 అదేవిధంగా అరుణాచలం కు సూపర్ లగ్జరీ బస్సుకు పెద్దలకు 4000 రూపాయలు మరియు పిల్లలకు 2300 రూపాయలు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు, బుకింగ్ కోసం సెల్: 9885103165,7382835016 నెంబరును సంప్రదించాలని సూచించారు. ముందుగా టికెట్ బుక్ చేసుకున్న వారిని మాత్రమే ప్రయాణానికి అవకాశం ఉంటుంది. డిపో పరిధిలోని భక్తులు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

G9 TV తెలుగు
తెలంగాణ వీణ
తెలుగు దినపత్రిక
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL

# వడియారం గ్రామంలో సదర్ పండుగ ఉత్సవాలు

**చేగుంట తెలంగాణ వీణ నవంబర్ 8**

మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామంలో సదర్ పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ పండుగ ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవ కర్త అయిత పరంజ్యోతి, చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ కుమార్, జూకంటి రాజు వడియారం ఉప సర్పంచ్ గిరి గౌడ్, వడియారం యాదవ సంఘం అధ్యక్షుడు నర్సింలు, యాదవ్,చేగుంట మండల యాదవ సంఘం అధ్యక్షుడు స్వామి యాదవ్, నరసింహులు యాదవ్, అనిల్ యాదవ్, రాజు యాదవ్, నదీమ్,సయ్యద్ ఉస ముద్దీన్ ,సాబెర్, ధ్యానిల్, అన్నం సాయి, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది



## నాచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**తెలంగాణ వీణ/నాచారం:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు సాధన వికలాంగుల ఇన్స్టిట్యూట్ లో నాచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఇన్స్టి ట్యూట్ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియ జేశారు అనంతరం పిల్లలకు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలు బ్రహ్మాండంగా అమలవు తున్నాయి అన్నారు. ముందు ముందు ఇంకా తెలంగాణ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు సీఎం రేవంత్ రెడ్డి రూపొందిస్తారని తెలిపారు






## భిక్షాటన చేస్తున్న వ్యక్తి మృతి..

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**

యాదగిరిగుట్ట ఓల్డ్ బస్టాండ్ ప్రాథమిక పాఠశాల మైదానంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఈ సంఘటన యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.. పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాల గ్రౌండ్ లో గుర్తు తెలియని వ్యక్తి (50) ఆరోగ్యంతో చనిపోయాడు.మృతుడు దేవాలయ పరిసర ప్రాంతాలలో భిక్షాటన చేస్తూ జీవిస్తుండేవాడని, మృత దేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.





# అసెంబ్లీకి వెళ్లని వారు రాజీనామా చేయండి

## జగన్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన షర్మిల

## ప్రజలు ఎన్నుకున్నది అసెంబ్లీకి వెళ్లడానికే అని స్పష్టీకరణ

**మచిలీపట్నం,నవంబర్8(తెలంగాణ వీణ):**

అసెంబ్లీకి వెళ్లనివారు ఎవరైనా రాజీనామా చేయాల్సిందేనని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్ అయినా, వైకాపా ఎమ్మెల్యేలైనా రాజీనామా చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేలుగా గెలిచాక అసెంబ్లీకి వెళ్లమంటే కుదరదని అన్నారు. ప్రజలు ఎన్నుకున్నది అసెంబ్లీకి వెళ్లాలని కానీ, ఇంట్ఓ కూర్చోవడానికి కాదన్నారు. ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని వైకాపా అధినేత జగన్ ప్రకటించడంపై షర్మిల తీవ్రంగా స్పందించారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే పదవుల్లో ఉండటం ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీకి వెళ్లి ఏం మాట్లాడగలం అని జగన్ మాట్లాడిన విషయం తెలిసిందే. అసెంబ్లీకి వెళ్లకపోయినా.. రాష్ట్ర ప్రభుత్వాన్ని మీడియా సమావేశాల ద్వారా ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. ఈ విషయంలో జగన్ తీరును షర్మిల తీవ్రంగా పరిగణించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదని వైఎస్ఆర్‌సీప చీఫ్ జగన్ తీసుకున్న నిర్ణయంపై షర్మిల విమర్శలు గుప్పించారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేని వారు రాజీనామా చేయాలన్నారు. జగన్ అయినా ఎమ్మెల్యేలు అయినా అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని ఆ హోదా లేకపోవడం వల్ల మాట్లాడేందుకు మైక్ ఇవ్వరని వైసీపీ చీఫ్ జగన్ అంటున్నారు. అందు వల్ల అసెంబ్లీకి వెళ్లినా ప్రయోజనం ఉండదని అందుకే తాము వెళ్లబోవడం లేదన్నారు. మీడియానే మాకు స్పీకర్ అని.. మీడియా ముదే తాము తమ వాదన వినిపిస్తామని జగన్ స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నంత సేపు తాము తమ వాదన మీడియా ముందు వినిపిస్తామని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ఈ కారణంగా ఆయనను ప్రధాన ప్రతిపక్ష నేతగా అర్హత సాధించలేదు. సంప్రదాయంగా పది శాతం అసెంబ్లీ సీట్లను గెల్చుకున్న వారికి ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇస్తారు. రెండు కన్నా ఎక్కువ పార్టీలు అలా గెల్చుకుని ఉంటే ఎక్కువ సీట్లు గెల్చుకున్న వారికి ఇస్తారు. వైసీపీకి పది శాతం అసెంబ్లీ సీట్లు రాకపోవడంతో ప్రధాన ప్రతిపక్ష నేత హోదా సాంకేతికరంగా రాలేదు. అయితే స్పీకర్ విచక్షణాధికారం ప్రకారం ఇవ్వొచ్చు. కానీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ లోపు వైఎస్ జగన్ తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వడం లేదని హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. దానిపై విచారణ వాయిదా పడింది. మాములుగా అయితే ఆయన వైసీపీ పక్ష నేత జగనేనని ఆయన ప్రతిపక్ష పార్టీనే కాబట్టి ప్రతిపక్ష నేతేనని కాదని ఎవరూ అనడం లేదని అంటున్నారు. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమితో పాటు ఒక్క వైసీపీ మాత్రమే ఉంది. అందుకే మాట్లాడేందుకు సమయం వస్తుందని జగన్ అసెంబ్లీకి రావాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు కూడా ఆహ్వానిస్తున్నారు. కానీ గత అసెంబ్లీలో జరిగిన పరిణామాలను బట్టి అసెంబ్లీకి హాజరైతే తమనూ అవమానిస్తారని వైసీపీ ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. జగన్ హాజరు కాకపోతే ఎమ్మెల్యేలను అయినా పంపితే ప్రజాస్వామ్యాన్ని గౌరవించినట్లు ఉంటుందని కొంత మంది వాదిస్తున్నారు. కానీ జగన మాత్రం.. అసెంబ్లీకి హాజరయ్యేది లేదని చెబుతున్నారు. బహుశా.. ఐదేళ్ల పాటు వారు హాజరు కాకపోతే.. నిబంధనల ప్రకారం వరుసగా మూడు సెషన్లకు హాజరు కాకపోతే అనర్హతా వేటు వేసే అధికారం స్పీకర్ కు ఉంటుంది.









# అసెంబ్లీకి రాకుండా పార్టీ ఎందుకు?

## జగన్‌ను విమర్శించిన టీడీపీ

## ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

**అమరావతి, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరిస్తున్నామని ప్రకటించడంపై మండిపడ్డారు. ఎన్నికల్లో పాల్గొనకుండా, అసెంబ్లీకి రాకుండా జగన్‌కు రాజకీయ పార్టీ ఎందుకని విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలా అక్రమాలు చేయాలో జగన్‌కు తెలిసినట్లు మరెవరికీ తెలియదని విమర్శించారు. బ్యాలెట్ పద్ధతిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆయన ఎందుకు దూరంగా ఉన్నారని ప్రశ్నించారు. గౌతమ్ రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎందుకు వెనక్కి తగ్గారని ప్రశ్నించారు. ఎన్నికల్లో పాల్గొనకుండా, అసెంబ్లీకి రాకుండా జగన్‌కు రాజకీయ పార్టీ అవసరమా అని నిలదీశారు. పులివెందులలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించలేని జగన్‌కు జీతమెందుకు అని భూమిరెడ్డి ప్రశ్నించారు. వెంటనే జగన్ రాజీనామా చేస్తే.. పులివెందులకు మరో ఎమ్మెల్యే వస్తారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రాకుండా జగన్ పారిపోవడం సిగ్గుచేటు అని అన్నారు.



# కేఏపాల్ పిటిషన్ డిస్మిస్

**అమరావతి, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. కేఏ పాల్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం ఉదయం విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కేఏ పాల్ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తిరుమల దేవాలయాల నిర్వహణ పాలకమండలి చేతిలో కాకుండా పూజారుల చేతుల్లో ఉంచాలని ఆ పిటిషన్‌లో కేఏ పాల్ కోరారు. కేవలం 744 మంది కేథలిక్‌లు ఉన్న వాటికణ్ సిటీని ప్రత్యేక ప్రాంతంగా గుర్తించారని.. అలాగే లక్షలాది మంది భక్తులకు ప్రాధాన్యత ఉన్న తిరుపతి కూడా అదేవిధంగా ప్రత్యేక ప్రాంతంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల దేవాలయానికి వచ్చే వేల కోట్ల ఆదాయం దుర్వినియోగం అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, సీబీఐ, డీజీపీలను కేఏ పాల్ ప్రతివాదులుగా చేరుస్తూ పిటిషన్ దాఖలు చేశారు.



# యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై అధికారులతో ముగిసిన ముఖ్యమంత్రి సమీక్ష.

## టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు

**తెలంగాణ వీణ/యాదగిరి గుట్ట:**

యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అధికారులకు స్పష్టం చేసిన సీఎం.టెంపుల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలన్న సీఎంటీటీడీ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం.టీటీడీ స్థాయిలో బోర్డుకు ప్రాధాన్యత ఉండేలా పూర్తి అధ్యయనంతో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలన్న సీఎం.గోశాలలో గోసంరక్షణకు ఒక ప్రత్యేక పాలసీని తీసుకురావాలని అధికారులకు సూచించిన ముఖ్యమంత్రి.గోసంరక్షణకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్న సీఎం.గతంలో కొండపై నిద్ర చేసేందుకు భక్తులకు అవకాశం ఉండదని గుర్తుచేసిన సీఎం.కొండపై నిద్ర చేసి మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన సీఎం.విమాన గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలన్న సీఎం.బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలన్న సీఎం.ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణను పూర్తి చేయాలన్న సీఎం.అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించిన సీఎంఆలయానికి సంబంధించి పెండింగ్ పనులు పూర్తి




# రెండు గంటలు ట్రాఫిక్‌ల్లోనే అయినా పదినిమిషాల్లో ఫుడ్ డెలివరీ

**బెంగళూరు, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తొచ్చేది కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగరమే. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే అగ్రస్థానం. ఇక్కడ కిలోమీటరు దూరానికి గంటల తరబడి రోడ్లపైనే పడిగాపులు కాయాల్సి వస్తుంది. దీంతో ప్రజలు తమ ట్రాఫిక్ కష్టాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంటారు. అలా, ఇటీవలే ఓ నెటిజన్ బెంగళూరు ట్రాఫిక్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. అర్పిత్ అరోరా అనే నెటిజన్ ఈనెల 5న ఎక్స్‌లో ఓ ట్వీట్ పెట్టాడు. దాదాపు రెండు గంటల పాటు తాను ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయినట్లు చెప్పారు. అయితే ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. పీక్ ట్రాఫిక్ ఫుడ్ డెలివరీకి మాత్రం ఎలాంటి ఆటంకం కలిగించకపోవడం. రెండు గంటల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అతడు.. అక్కడి నుంచే ఫుడ్ ఆర్డర్ చేయగా 10 నిమిషాల్లోనే డెలివరీ అయినట్లు చెప్పారు. అయితే, ఫుడ్ తినడం అయిపోయినా కూడా ట్రాఫిక్ మాత్రం ముందుకు కదలడం లేదంటూ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అతడి ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'బెంగళూరు మహానగరంలోనే ఇలాంటివి సాధ్యం' అంటూ చమత్కరిస్తున్నారు. కాగా, సిలికాన్ వ్యాలీగా పేరుగాంచిన బెంగళూరు మహానగరంలో ట్రాఫిక్ కష్టాల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. రోజురోజుకూ నగరంలో ట్రాఫిక్ పెరిగిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. ప్రపంచంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే నగరాల్లో బెంగళూరుది రెండో స్థానం. ఇక్కడ 2–3 కిలోమీటర్ల ప్రయాణానికే గంటల సమయం పడుతోంది. పని మీద బయటకు వెళ్లాలంటనే ట్రాఫిక్ బారులను చూసి పౌరులు బెంబేలెత్తిపోతున్నారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు అద్దం పట్టే ఘటనలు ఇప్పటికే సోషల్ మీడియాలో అనేకం వెలుగులోకి వచ్చాయి. సుదీర్ఘ ట్రాఫిక్ జామ్‌ను తప్పించుకునేందుకు అనేకమంది నగర వాసులు మెట్రో రైలు వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను అనుసరిస్తున్నారు. నగరంలోని 95 శాతం మంది వాహనాల యజమానులు కూడా ఇదే చెబుతున్నారని పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.



# ఎట్టకేలకు మహిళా అఘోరీకి ఆలయంలోకి అనుమతి

**అమరావతి, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

శ్రీకాళహస్తిలో మహిళా అఘోరీ దిగంబరంగా ఆలయంలోకి వెళ్లేందుకు యత్నించి హల్‌చల్ చేసింది. ఎట్టకేలకు వస్త్రాలు ధరించి శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకునేందుకు అంగీకరించారు. దీంతో పోలీసుల బందోబస్తు నడుమ దర్శనం ముగించుకుని క్షేత్రాన్ని విడిచి వెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. కొద్దిరోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ వస్తున్న మహిళా అఘోరీ (నాగ సాధువు) గురువారం నాడు తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి వచ్చారు. దిగంబరంగా ఆలయంలోని శివయ్య గోపురం గుండా లోపలికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో ఆమెను మహానందీశ్వరుడి ప్రతిమ సమీపంలో భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఆలయ నిబంధనల ప్రకారం దుస్తులు లేకుండా ఆలయంలోకి అనుమతించేది లేదని సిబ్బంది సూచించారు. దీంతో భద్రతా సిబ్బందితో ఆమె వాగ్వాదానికి దిగారు. తనను ఎలాగైనా దర్శనానికి పంపాల్సిందేనని పోలీసులతో గొడవకు దిగారు. ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మార్పణ చేసుకునేందుకు కూడా యత్నించారు. దీంతో పట్టణ పోలీసులు, ఆలయ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. బలవంతంగా ఆమెకు వస్త్రాలు చుట్టి.. ఆలయ అంబులెన్స్‌లో మహిళా భద్రతా సిబ్బందితో బందోబస్తుగా తమిళనాడు పరిధిలోని ఆరంబాకంలో వదిలిపెట్టారు. అయితే గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో మళ్లీ మహిళా అఘోరి శ్రీకాళహస్తికి వచ్చారు. సంప్రదాయ దుస్తులను ధరించి వస్తేనే దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారులు నచ్చజెప్పారు. ఎట్టకేలకు ఎర్రని వస్త్రంతో శరీరాన్ని కప్పుకుని.. కపాల మాలలు తీసి వేసి ఆలయంలోకి వెళ్లేందుకు సుముఖత చూపించారు. దీంతో పోలీసు బందోబస్తు నడుమ అఘోరీ శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు.



# సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

**హైదరాబాద్, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రధాని మోదీ పోస్టుకు సీఎం రేవంత్ స్పందించారు. మీ విషెస్‌కు ధన్యవాదాలు అని పేర్కొన్నారు. కాగా, ముఖ్యమంత్రిగా తొలి పుట్టినరోజును జరుపుకుంటున్న రేవంత్ రెడ్డి మరికాసేపట్లో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకోనున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడుతారు. మూసీ పునరుజ్జీవ యాత్రను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు.



# బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**భువనగిరి, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

ముఖ్యమంత్రిని అడ్డుకుంటారనే అనుమానంతో బీబీనగర్, వలిగొండ, యాదగిరిగుట్ట, ఆలేరు, చిట్యాల మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిని ఆలేరులో హౌస్ అరెస్టు చేశారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను అదుపులోకి తీసుకున్నారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. వలిగొండ, సంగెంలో వందలాది మంది పోలీసులను మోహరించారు. కాగా, పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను బీఆర్ఎస్ ఖండించింది. నాయకులు, కార్యకర్తలను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన్ని వదిలి, హెలికాప్టర్‌లో పాదయాత్రకు సిద్ధమయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరి భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించే విధంగా రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. పాదయాత్ర మార్గమధ్యంలో ఆయనకు ఎవరెవరు వంగి దండాలు పెట్టాలి, మెడలో ఎవరు దండలు వేయాలి, హారతులు ఎవరు పట్టాలి, పార్టీ కార్యకర్తల గుంపులు ఎక్కడెక్కడ నిలబడి జై కొట్టాలి.. అనే అంశాలపై ముందస్తుగానే పకడ్బందీ ప్లాన్ చేశారు. ఎంపిక చేసిన రైతులు మాత్రమే ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు వీలుగా సమావేశ స్థలాన్ని సిద్ధంచేసి పెట్టినట్టు తెలిసింది. రైతు సమావేశంలో సీఎంను ఏఏ ప్రశ్నలు అడగాలనే దాని మీద ఓ ఎంపీ సమక్షంలో ఇప్పటికే వారికి శిక్షణ ఇచ్చినట్టు తెలుస్తున్నది. పతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టడానికి మూసీ పరీవాహక ప్రాంతం వెంట పాదయాత్ర చేస్తానని తొలుత సీఎం రెవంత్‌రెడ్డి ప్రకటించారు. పాదయాత్ర కుదింపు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం తన పుట్టినరోజును పురస్కరించుకొని అదేరోజున మూసీ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తానని తొలుత ప్రకటించారు. సంగెం గ్రామం నుంచి మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే మూడు రోజులు చేస్తానన్న పాదయాత్ర.. ప్రజా వ్యతిరేకత కారణంగా ఒక్కరోజుకే కుదించి మొక్కుబడిగా చేపడుతున్నట్టు అర్థమవుతున్నది. ఈ మేరకు శుక్రవారం ఉదయం సంగెం నుంచి మూసీ నది కుడి ఒడ్డు నుంచి యాత్ర ప్రారంభమై, భీమలింగం వరకు దాదాపు 2.5 కిలోమీటర్ల వరకే పాదయాత్ర కొనసాగుతుందని, అక్కడి నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కెనాల్ కట్ట వెంబడి నాగిరెడ్డిపల్లి రోడ్డు వరకు యాత్ర కొనసాగిస్తారని నిర్వాహకులు ప్రకటించారు.






# అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హెూదా కల్పించే కేసులో సుప్రీం నాలుగు తీర్పులు

**న్యూఢిల్లీ, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హెూదా కల్పించే కేసులో .. ఇవాళ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నాలుగు రకాల తీర్పులను వెలువరించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని ఏడుగురు ధర్మాసనం ఈ తీర్పుల గురించి తెలిపింది. ఏఎంయూ కేసులో నాలుగు రకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయని, దీంట్లో మూడు రకాల వ్యతిరేక తీర్పులు ఉన్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. మెజారిటీ తీర్పు తనతో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జేబీ పర్దీవాలా, మనోజ్ మిశ్రా రాసినట్లు సీజే వెల్లడించారు. జస్టిస్ సూర్యకాంత్, దీపాంకర్ దత్త, సతీశ్ చంద్ర శర్మలు సపరేట్ తీర్పులను ఇచ్చినట్లు జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. విద్యా సంస్థ నియంత్రణ, పరిపాలన విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేసినా.. ఆ విద్యాసంస్థకు ఉన్న మైనార్టీ హెూదాను రద్దు చేయరని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. పార్లమెంట్ చట్టంతో అలీఘడ్ ముస్లిం వర్సిటీ మైనార్టీ హెూదా రద్దు అయినట్లు 1968లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టిపారేస్తున్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. అడ్మినిస్ట్రేషన్‌లో మైనార్టీ సభ్యులు లేనంత మాత్రాన.. ఆ వర్సిటీ మైనార్టీ హెూదా పోదు అని సుప్రీంకోర్టు చెప్పింది.



# నరసింహ స్వామి దగ్గరికి సీఎం రేవంత్ రెడ్డి మోకాళ్ల యాత్ర చేయాలి

## బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 8 (తెలంగాణ వీణ)**

పాదయాత్ర కాదు ముందు యాదగిరి నరసింహ స్వామి దగ్గరికి సీఎం రేవంత్ రెడ్డి మోకాళ్ల యాత్ర చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి సూచించారు. రేవంత్ రెడ్డి చేసేది పాదయాత్ర కాదు పాపపు యాత్ర, ప్రాయశ్చిత్త యాత్ర, పశ్చాత్తాప యాత్ర అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హెూదాలో తెలంగాణ ప్రజలకు ప్రతినిధిగా ఉంటూ ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తానని రైతులకు హామీ ఇస్తూ.. ఏకంగా లక్ష్మీనరసింహ స్వామి మీద ఒట్టేశారని ఏనుగుల రాకేశ్ రెడ్డి గుర్తుచేశారు. రాజ్యాన్ని పాలించే రాజు ఒట్టేసే మాట తప్పితే ఆ ప్రభావం, దైవాగ్రహం ప్రజల మీద పడుతుందని చెప్పారు. అందుకే, తెలంగాణలో గత వర్షాకాలం వర్షాలు ఆలస్యంగా పడ్డాయని అన్నారు. ములుగు అడవులు కూడా ఎన్నడూ జరగని విధంగా విధ్వంసమయ్యాయని.. ధామగుండంలో చెట్లు పోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ నాశనమైందని.. రియల్ ఎస్టేట్ రంగం, వ్యాపారాలు, కొనుగోలు అమ్మకాలు ఎక్కడిక్కడ ఆగిపోయాయని.. మార్కెట్లో రూపాయి తిరిగే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. మూసీ పుట్టిన వికారాబాద్‌లో అడవులు ధ్వంసం చేసి.. మూసీ ప్రవహించే హైదరాబాద్‌లో ఇల్లు కూలగొట్టి వలిగొండలో పాదయాత్ర చేస్తావా అని రేవంత్ రెడ్డిపై ఏనుగుల రాకేశ్ రెడ్డి మండిపడ్డారు. అయినా పాదయాత్ర చేయాల్సింది రైతుల కల్లాల కాడికి, ఛిద్రమైన మా పోచంపల్లి చేనేతల మగ్గాల కాడికి, నిత్యం ఆసుపత్రుల పాలవుతున్న మా గురుకుల విద్యార్థుల దగ్గరకు అని అన్నారు. ప్రజల మద్దతు ఉంటే మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఎందుకు అక్రమంగా అరెస్టు చేస్తున్నావని ప్రశ్నించారు. ప్రజలు నిలదీస్తారని ఈ కథలు పడుతున్నావ్.. దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా పాదయాత్ర చేయాలని డిమాండ్ చేశారు.



# నిరుద్యోగులపై సైబర్ నేరగాళ్ల వల

## ఉద్యోగాల పేరుతో భారీగా వసూళ్లు- కంబోడియా తరలించి సైబర్ నేరాల ఉచ్చులోకి దింపేపని

**హైదరాబాద్,నవంబర్8(తెలంగాణ వీణ):**

తెలంగాణలో సైబర్ క్రైమ్ నేరాల కోసం ఓ ముఠా నిరుద్యోగులకు వల వేసి కంబోడియా తరలిస్తుంది. కంబోడియాలో ఉద్యోగాల పేరిట చేర్చుకున్న తర్వాత వారిని బలవంతంగా సైబర్ క్రైమ్ నేరాలు చేయాలని బలవంతం చేస్తారు. ఈ క్రమంలోనే ఓ బాధితుడు చిక్కుకోగా అతడి నుండి అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సిరిసిల్లకు చెందిన ఓ యువకుడిని ఉద్యోగం పేరిట ఆ ముఠా కంబోడియా పంపింది. కంబోడియా చేరుకోగానే చైనాకు చెందిన సైబర్ క్రైమ్ ముఠాలకు యువకుడిని అప్పజెప్పారు. ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, వీసాఫీజు అంటూ కంబోడియాకు పంపేముందు ఆ ముఠా యువకుడి నుండి లక్ష నలభై వేలు వసూలు చేసింది. అయితే, కంబోడియా చేరుకోగానే యువకుడి వద్ద పాస్ పోర్టును లాక్కుని సైబర్ నేరాలు చేయాలంటూ ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆ బాధిత యువకుడు తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. సిరిసిల్లకు చెందిన యువకుడి తల్లి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు యూపీకి చెందిన సదకత్ ఖాన్ ను అరెస్ట్ చేశారు. ఈ ముఠా బారిన సుమారు 500 నుండి 600 మంది చిక్కుకున్నట్లు సమాచారం.







# నిజాయితీ కొరవడుతున్న కేసులు

## అసలు దోషులను పట్టించుకోని బిజెపి ప్రభుత్వం

**న్యూఢిల్లీ,నవంబర్8(తెలంగాణ వీణ):**

రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు కొనసాగుతున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. జగన్ విషయంలో చేసిన ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బిజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉన్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయలేదని అంటుఎన్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. గతంలోనే ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయినా.. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగపరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీల్లో ఆందోళన చెందుతున్నాయి. పొంగులేటి, గ్రంధి శ్రీనివాస్ లాంటి వారిని తప్ప పెద్ద తలకాలయ జోలికి వెళ్లడం లేదు. దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి తాజా నిదర్శనం. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడి విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రివాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ప్రత్యేకహోదా కోసం నిలదీసినందుకు ఇడి తనను వేధిస్తోందంటూ గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ఏకంగా రాజకీయాలకు గుడ్‌బై చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణా లెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించేవారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయితే, నేరం రుజువై శిక్ష పడింది మాత్రం కేవలం 10 మందికి మాత్రమే! గడిచిన 18 ఏళ్లలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఏ) కింద 5,422 మందిపై ఇడి కేసులు పెట్టి దర్యాప్తు చేయగా, 23మందికి మాత్రమే శిక్ష పడింది. ఇది కేవలం 0.5శాతం మాత్రమే! దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణంగానే అంతా ఇడి అంటే భయపడుతున్నారు. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది.తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉంది.

# కుప్పకూలిన భవనం

## తప్పిన ప్రాణనష్టం

**బెంగళూరు, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

కర్ణాటక రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోలార్ జిల్లాలో ఓ నివాస భవనం ఒక్కసారిగా కుప్పకూలింది . అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.కోలార్‌లోని బంగార్‌పేట్‌లో రెండంతస్తుల నివాస భవనంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పనులు చేస్తుండగా.. భవనానికి పగుళ్లు వచ్చాయి. ఈ క్రమంలో అది ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అయితే, ప్రమాదాన్ని ముందే ఊహించిన అగ్నిమాపక శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా అందులో నివసిస్తున్న మూడు కుటుంబాలను ఖాళీ చేయించారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. మరోవైపు బిల్డింగ్ కూలిపోతున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## గురుకులల్లో విద్యార్థులు చస్తుంటే

# బర్తుడే వేడుకలా

### బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, నవంబర్ 8 (తెలంగాణ వీణ) :**

రేవంత్ రెడ్డి బర్త్ డే వేడుకలు అన్ని గురుకుల పాఠశాలల్లో అధికారికంగా నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పడాన్ని ఖండిస్తున్నామని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఉపాధ్యక్షుడు తుంగబాలు, రఘురాంతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా పని చేసిన పొన్నం ప్రభాకర్‌కు నిబంధనలు తెలియవా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బర్త్ డే వేడుకలు గురుకుల పాఠశాలల్లో ఎందుకు చేయాలన్నారు. రాష్ట్రంలో అన్ని గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు దవాఖాన పాలు అవుతున్నారు. ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా కూడా గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రివ్యూ చేయలేదని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురి అయ్యారు. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను చంపడమే కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడమా? అని నిలదీశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే గురుకుల పాఠశాలలకు పర్మినెంట్ బిల్డింగ్స్ కట్టాలన్నారు. గురుకుల పాఠశాలలకు ప్రభుత్వం నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో సమస్యలు అడిగి తెలుసుకుంటామని, సమస్యల దరఖాస్తులను కేటీఆర్, ప్రభుత్వానికి ఇస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వ్యవస్థలను కుప్పకూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# గిరిజనుల కోసం పరిష్కార వేదిక

**నెల్లూరు,నవంబర్8(తెలంగాణ వీణ):**

నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని 39 వేల మంది గిరిజనుల కోసం పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గిరిజనుల్లో చాలా మందికి ఆధార్, రేషన్‌కార్డులు లేవని, సుమారు 90శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారని చెప్పారు. పింఛన్ సమస్యలు కూడా ఉన్నాయని చెప్పిన ఆయన.. వీటన్నింటినీ పరిష్కరించేందుకే ఓ వేదికను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరిజనుల దుర్భర జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. జిల్లా అధికారులంతా గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. గిరిజనుల విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించకూడదు. 90 శాతం కేంద్ర పథకాలను గిరిజనులకు అందకుండా గత ప్రభుత్వం ఆపేసింది. వాటిని సర్వేపల్లి గిరిజనులకు చేరవేస్తాము. గత ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన గిరిపుత్రులను ఆదుకుంటాం. ప్రతి అధికారి గిరిజనుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదు. స్థానికులకు లోన్లు మంజూరు చేస్తాం. పాఠశాలలను అభివృద్ధి చేస్తాం‘ అని సోమిరెడ్డి తెలిపారు.

# ఐదేళ్లపాటు కేసులతో జగన్ పైశాచికానందం

### ప్రజాస్వామ్య బద్ధంగా కూటమి పాలన

### తప్పు చేసిన వారిని వదిలేదు లేదన్న అచ్చన్న

**శ్రీకాకుళం,నవంబర్8(తెలంగాణ వీణ):**

జగన్ తన హయాంలో గత ఐదేళ్లలో ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన వారిపై కేసులు పెట్టి జగన్ పైశాచిక ఆనందం పొందారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అచ్చెన్నాయుడు విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా కూటమి ప్రభుత్వం నడుస్తోందని స్పష్టంచేశారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు లేదన్నారు. తప్పు చేసిన వారు ఏ పార్టీ వారైనా చట్ట ప్రకారం చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. జగన్మోహన్ రెడ్డికి బుద్ధి జ్ఞానం ఉందా అంటూ విరుచుకుపడ్డారు.భావ స్వేచ్ఛ అంటూ జగన్ వ్యక్తి హననానికి పాల్పడుతున్నారన్నారు. భావస్వేచ్ఛ ప్రకటన అంటూ ఆడవారిపై పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా పోస్టుల వలన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధపడ్డారన్నారు. ‘జన్మనిచ్చిన తల్లి, చెల్లిపై కూడా తప్పుడు పోస్టులు పెట్టిన జగన్ మనిషేనా అంటూ ప్రశ్నించారు. ఆడవారిని ఏడిపిస్తే చూస్తూ ఊరుకోం, ఖబర్దార్ జగన్!‘ అంటూ హెచ్చరించారు. ఈరోజు నుంచి ఎవరైనా మహిళలపై వ్యక్తి హననానికి పాల్పడితే సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరించారు. అధికారంలో ఉన్న లేకపోయినా తాము ప్రజా సమస్యలపై స్పందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు.

# ప్రజావాణికి మొత్తం 471 దరఖాస్తులు

**హైదరాబాద్,నవంబర్8(ఆర్ఎన్ఎ):**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 471 దరఖాస్తులు అందాయి. బిసి వెల్ఫేర్ శాఖకు సంబంధించి 156, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 87, విద్యుత్ శాఖ కు సంబంధించి 75, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 50 ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 04, ఇతర శాఖలకు సంబంధించి 99 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్ని జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024










తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
09 శనివారం, నవంబర్ 2024

క్రీడలు



# కేఎల్ రాహుల్, అభిమన్యు ఔట్..

## తుది జట్టులోకి ధ్రువ్ జురెల్ రాక



సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో ఘోర పరాజయానికి గురైన టీమిండియా మరో ఆసక్తికర టెస్ట్ సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. వరల్డ్ టెస్టు ఛాంపి యన్‌షిప్ (2024-25)లో టీమిండి యాకు ఇదే చివరి సిరీస్. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే రోహిత్ సేన ఈ సిరీస్ గెలవడం అత్యంత కీలకం. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కనీసం 4-0తో కైవసం చేసు కుంటేనే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా భారత్ ఫైనల్‌కు చేరుతోంది.మరోవైపు డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆసీస్‌కు ఆ స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలంటే ఈ సిరీస్ గెలవడం కీలకం. ఈ క్రమంలోనే ఈ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2016 నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై 2018-19, 2020-21 సిరీస్‌లను కైవసం చేసుకుంది. అయితే ఇటీవల ఆస్ట్రేలియా సూపర్ ఫామ్‌లో ఉంది. ఈ సిరీస్‌లోని ఆరంభ మ్యాచ్‌లకు కెప్టెన్ రోహిత్ శర్మ దూరం కానున్నాడు. తన సతీమణి రితికా సజ్దే రెండో బిడ్డకు జన్మనివ్వనున్న నేపథ్యంలో ఆమె పక్కనే ఉండేందుకు రోహిత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐ కూడా అతనికి అనుమతిచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. రోహిత్ శర్మ గైర్హాజరీ టీమిండియాకు పెద్ద తలనొప్పిగా మారింది. అతని స్థానంలో ఓపెనర్‌గా ఎవర్నీ ఆడించాలి? అనేది టీమ్‌మేనేజ్‌మెంట్ తేల్చుకోలేకపోతుంది. కేఎల్ రాహుల్‌తో ఓపెనింగ్ చేయించాలని భావించిన టీమిండియా మేనేజ్‌మెంట్.. అందరి కన్నా ముందు అతన్ని ఆస్ట్రేలియా పర్యటనకు పంపించి భారత్-ఏ తరఫున బరిలోకి దింపింది. కానీ అతను రెండో ఇన్నింగ్స్‌ల్లో 4, 10 దారుణంగా విఫలమయ్యాడు. రోహిత్ శర్మకు బ్యాకప్‌గా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ఎంపికైన మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ కూడా తీవ్రంగా నిరాశపరిచాడు. ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరిగిన తొలి అనధికారిక టెస్టులో అభిమన్యు 7, 12 పరుగులే చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న రెండో టెస్టులో అభిమన్యు 0, 17 పరుగులకే పరిమిత మయ్యాడు. ఈ ఇద్దరి పేలవ ఫామ్ టీమిండియా మేనేజ్‌మెంట్‌ను కల వరపెడుతోంది. పేస్‌కు అనుకూలంగా ఉండే ఆసీస్ పిచ్‌లపై కొత్త బంతిని ధీటుగా ఎదుర్కోవడం చాలా ముఖ్యం. ఓపెనర్లు తడబడితే.. ఒత్తిడిలో మిగతా బ్యాటర్లు కూడా పెవిలియన్‌కు క్యూ కడుతారు. ఈ క్రమంలోనే యశస్వి జైస్వాల్‌కు జతగా ఎవర్నీ ఆడించాలనేదానిపై గౌతమ్ గంభీర్ తర్జనా భర్జనా పడుతున్నాడు. అయితే శుభ్‌మన్ గిల్‌ను ఓపెనర్‌గా ఆడించి.. భారత్-ఏ తరఫున అద్భుత ప్రదర్శన కనబర్చిన యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్‌ను జట్టులోకి తీసుకోవాలని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు.ఆస్ట్రేలియా-ఏతో తొలి టెస్ట్‌కు దూరంగా ఉన్న ధ్రువ్ జురెల్.. రెండో మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 80 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో 19 పరుగులతో క్రీజులో నిలిచాడు. ధ్రువ్ జురెల్‌ను మిడిలార్డర్‌లో బ్యాటర్‌గా ఆడించి గిల్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించడమే ఉత్తమమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలా కాదని ఫామ్‌లో లేని కేఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్‌లు ఆడిస్తే మాత్రం మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరిస్తున్నారు.





## గంభీర్‌కు తలనొప్పిగా మారిన రోహిత్ నిర్ణయం!

సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూసిన భారత్ మరో టెస్టు సిరీస్ సమరానికి సిద్ధమైంది. నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ ఆడనుంది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (2024-25)లో టీమిండియాకు ఇదే చివరి సిరీస్. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే రోహిత్ సేన ఈ సిరీస్ అత్యంత కీలకం. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కనీసం 4-0తో విజయం సాధిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా భారత్ ఫైనల్‌కు చేరుకోగలదు. మరోవైపు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరాలంటే ఆస్ట్రేలియాకు కూడా ఈ సిరీస్ ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న వన్డే, టీ20 సిరీస్‌ను లైట్ తీసుకుని కీలక ప్లేయర్లు రెడ్ బాల్‌తో సాధన మొదలుపెట్టారు. 2016 నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ భారత్ విజయం సాధిస్తున్నప్పటికీ ఇటీవల ఫామ్ ఆసీస్‌ను ఫేవరేట్‌గా మారుస్తోంది. గత రెండు ఆస్ట్రేలియా పర్యటనల్లోనూ టీమిండియానే నెగ్గింది. కాగా, నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న అయిదు టెస్టు సిరీస్‌లో పెర్త్ వేదికగా జరిగే తొలి టెస్టుకు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ దూరం కానుననాడు. తన భార్య రితికా సజ్దేహ్ రెండో బిడ్డకు జన్మనివ్వనున్న నేపథ్యంలో కుటుంబంతో ఉండాలని హిట్‌మ్యాన్ ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బ్యాకప్ ఓపెనర్‌ను సిద్ధం చేయడానికి టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ చర్యలు వేగవంతం చేశాడు. టీమిండియాతో కంటే ముందే కేఎల్ రాహుల్‌ను ఆస్ట్రేలియాకు పంపాడు. భారత్-ఏ జట్టుకు ఓపెనర్‌గా బరిలోకి దిగమని సూచించాడు. అలాగే తొలిసారి టీమిండియాకు ఎంపికైన అభిమన్యు ఈశ్వరన్‌ను కూడా పరిస్థితులకు తగ్గట్లుగా ఆడుతూ ఇన్నింగ్స్‌కు శుభారంభాల్ని అందించాలని సూచనలు చేశాడు. కానీ, ఆస్ట్రేలియాలో బ్యాకప్ ఓపెనర్లు కేఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్ .. ఇద్దరూ అట్టర్ ఫ్లాప్ అవుతున్నారు. ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరిగిన తొలి అనధికారిక టెస్టులో అభిమన్యు 7, 12 పరుగులే చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న రెండో టెస్టులో అభిమన్యు 0, 17 పరుగులకే పరిమితమయ్యాడు. మరోవైపు రెండో టెస్టు మాత్రమే ఆడుతున్న రాహుల్ 4, 10 పరుగులే చేసి నిరాశపరిచాడు. ఈ నేపథ్యంలో యశస్వి జైస్వాల్‌తో కలిసి ఎవరిని భారత ఓపెనర్‌గా పంపాలని గంభీర్ తలపట్టుకుంటున్నాడు. ఇద్దరూ విఫలమవుతుండటంతో ఓపెనింగ్ కాంబినేషన్ ఎంపిక చేయడంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నాడు. ఇప్పటికే టెస్టుల్లో కోచ్‌గా విఫలమవుతున్నాడని విమర్శలు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో, వ్యక్తిగత కారణాలతో తొలి టెస్టుకు దూరమవ్వాలనుకున్న రోహిత్ నిర్ణయం.. గంభీర్‌ను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేసింది.

## బ్యాటింగ్‌లో వైఫల్యమే ఓటమికి కారణం

### ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్



అడిలైడ్ వేదికగా శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కంగారూల గడ్డపై ఏడేళ్ల తర్వాత తొలిసారి గెలుపు రుచి చూసింది. మరోవైపు ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఆల్‌రౌండ్ షోతో ఆసీస్‌ను చిత్తుగా ఓడించింది. తొలి వన్డేలో ఆస్ట్రేలియా నెగ్గిన సంగతి తెలిసిందే. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 35 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. స్టీవ్ స్మిత్ (35బీ 48 బంతుల్లో, 5 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్. పాకిస్థాన్ బౌలర్లలో హారిష్ రవూఫ్ అయిదు వికెట్లు, షాహిన్ అఫ్రిది మూడు వికెట్లు పడగొట్టాడు. నసీమ్ షా ఒక్క వికెట్ తీశాడు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పాక్ క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఆసీస్‌ను తక్కువ స్కోరుకు కట్టడిచేసింది. అనంతరం ఛేదనకు దిగిన పాకిస్థాన్ 26.3 ఓవర్లలో ఒక్క వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. సయిమ్ అయుబ్ (82బీ 71 బంతుల్లో, 5 ఫోర్లు, 6 సిక్సర్లు), అబ్దుల్లా షఫికి (64 నాటౌట్‌బీ 69 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలతో సత్తాచాటారు. బాబర్ అజామ్ (15 నాటౌట్‌బీ 20 బంతుల్లో, 1 సిక్సర్) పరుగులు చేశాడు. ఆడమ్ జంపా ఆయుబ్‌ను ఔట్ చేశాడు. షఫికి నిలకడగా పరుగులు సాధించగా, అయుబ్ ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముచ్చటైన బౌండరీలతో, కళ్లుచెదిరే సిక్సర్లతో అలరించాడు. కాగా, మ్యాచ్ అనంతరం ఓటమిపై ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్పందించాడు. బ్యాటింగ్‌లో వైఫల్యమే తమ ఓటమికి కారణమని చెప్పాడు. పాక్ బౌలర్లు గొప్పగా బౌలింగ్ చేశారని, అయితే తాము కాస్త మెరుగైన స్కోరు చేయాల్సిందని అభిప్రాయపడ్డాడు. ఎటాకింగ్ బౌలింగ్, ఫీల్డింగ్‌తో స్కోరును కాపాడుకోవడానికి ప్రయత్నించామని, కానీ అది జరగలేదని తెలిపాడు. ఇక మూడో వన్డే సారథి బాధ్యతలు జోష్ ఇంగ్లిస్‌కు అప్పగిస్తున్నానని, భారత్‌తో టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతామని కమిన్స్ పేర్కొన్నాడు. నవంబర్ 22 నుంచి మొదలయ్యే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం మెరుగైన ప్రాక్టీస్ చేస్తామని అన్నాడు.


## రిటైర్మెంట్‌పై మహ్మద్ నబీ కీలకనిర్ణయం!

అఫ్ఘానిస్థాన్ స్టార్ ఆల్‌రౌండర్ మహ్మద్ నబీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2025లో పాకిస్తాన్ వేదికగా జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డేలకు వీడ్కోలు పలకనున్నట్లు తెలిపాడు. ఈ విషయాన్ని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ నసీబ్ ఖాన్ క్రిక్‌బజ్‌కి ధృవీకరించారు. నబీ టీ20ల్లో మాత్రం కొనసాగనున్నాడు. 'మహ్మద్ నబీ వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలనుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అవి నిజమే. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత అతడు రిటైర్ అవుతాడు. ఇప్పటికే అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు దృష్టికి ఈ విషయాన్ని నబీ తీసుకొచ్చాడు. ఇదే విషయంను కొన్ని నెలల కిందటే నాకు చెప్పాడు. నబీ నిర్ణయాన్ని మేం స్వాగతిస్తున్నాం. టీ20ల్లో మాత్రం నబీ కొనసాగుతాడని ఆశిస్తున్నాం' అని నసీబ్ ఖాన్ క్రిక్‌బజ్‌తో అన్నాడు. 2009లో అఫ్గానిస్థాన్ తరఫున క్రికెట్ అరంగేట్రం చేసిన మహ్మద్ నబీ.. 165 వన్డేల్లో 3549 పరుగులు, 171 వికెట్లు పడగొట్టాడు. వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్, పాకిస్తాన్‌లపై అఫ్గాన్ చారిత్రత్మక విజయాలు సాధించడంలో నబీది కీలక పాత్ర. యువ ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇప్పటికే టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఇక పొట్టి ఫార్మాట్‌లో టీ20 ప్రపంచకప్ 2026 వరకు కొనసాగే అవకాశముంది.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..



# సినిమా






09 శనివారం, నవంబర్ 2024

## ఎవరూ సపోర్టు చేయరు మిమ్మల్ని మీరే నమ్ముకోవాలి : దిల్‌రాజ్

నా మూవీ ఫంక్షన్‌కి సినీ ప్రముఖులు రాలేదని జితేందర్ రెడ్డి సినిమా హీరో రాకేష్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వార్తలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్‌గా మారాయి. అయితే యువ హీరోల సినిమాలకు తెలుగు ఇండస్ట్రీలో సపోర్ట్ రావాట్లేదని వస్తున్న వ్యాఖ్యలపై తాజాగా స్పందించాడు ప్రముఖ నిర్మాత దిల్ రాజు. కిరణ్ అబ్బవరం నటించిన తాజా చిత్రం క. ఈ సినిమా దీపావళి కానుకగా విడుదలై మంచి విజయాన్ని అందుకోంది. అయితే ఈ సినిమా సక్సెస్ ఈవెంట్‌ను తాజాగా నిర్వహించారు మేకర్స్. ఇక ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన దిల్ రాజు ఈ మధ్య యువ హీరోల సినిమాలకు తెలుగు ఇండస్ట్రీలో సపోర్ట్ రావాట్లేదని అని వస్తున్న వార్తలపై స్పందించాడు. యువ హీరోలకు ఒకటే చెబుతున్న. ఇండస్ట్రీలో మిమ్మల్ని మీరే ప్రూవ్ చేసుకోవాలి. ఎవడో ఎదో అంటున్నాడు అని మీరు భయపడకుడదు. కిరణ్‌కు ప్రతిభ ఉంది కాబట్టే క సినిమాతో ఈరోజు సక్సెస్ అయ్యాడు. మీ దర్శకుల దగ్గర ట్యాలెంట్ ఉంది కాబట్టి సక్సెస్ అయ్యాడు. ఇక్కడ టాలెంట్ మాత్రమే మిమ్మల్ని




గుర్తిస్తుంది. మీకు సక్సెస్ వచ్చినప్పుడే మాలాంటి పెద్దలం వచ్చి అభినందిస్తున్నాం. ఈ సినిమా మీది. ఈ జర్నీ మీది. ఎవరో ఎదో చెస్తారు ఇండస్ట్రీలో అంటే ఎవరు ఏం చేయరు. మొన్న నా మూవీ ఫంక్షన్‌కి సినీ ప్రముఖులు రాలేదని జితేందర్ రెడ్డి సినిమా హీరో రాకేష్ అన్నాడు. రారు అమ్మ ఎందుకు వస్తారు. ఎవరి బిజీ వాళ్లది. ఎవరి లైఫ్ వాళ్లది. సినీ ప్రముఖులు వచ్చారా రాలేదా అనేది ముఖ్యం కాదు. నువ్వు ఎలా ప్రేక్షకుల దగ్గరికి నీ సినిమాకు తీసుకెళ్లావు అనేది ముఖ్యం. సో ఎటువంటి అంచనాలను పెట్టుకోకుండా మీరు కష్టపడి సినిమాను తీసి ఈ కంటెంట్‌తో ప్రేక్షకుల దగ్గరికి వెళ్లండి అంటూ దిల్ రాజు చెప్పుకోచ్చాడు.

## ఐటెమ్ సాంగ్‌లో శ్రీలీల పుష్ప.2 ఇక రచ్చరచ్చే



తెలుగు ప్రజలతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాంచైజీ మూవీలో టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని 2024 డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారని తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో స్పెషల్ సాంగ్‌కు సంబంధించిన వార్త ఒకటి బయటకు వచ్చింది. ఈ పాటలో ముందు శ్రద్ధాకపూర్‌ను అనుకోగా వర్కవుట్ కాకపోవడంతో శ్రీలీలను తీసుకున్నారని తెలిసిందే. తాజాగా శ్రీలీల సాంగ్ షూట్‌లో జాయిన్ అయిందట. రిలీజ్ డేట్‌ను దృష్టిలో పెట్టుకుని జెట్ స్పీడులో సాంగ్ చిత్రీకరిస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ పాట కోసం వారం రోజుల తీసుకోబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. గుంటూరు కారం తర్వాత చేస్తున్న రెండో పెద్ద సినిమా కావడం శ్రీలీలకు బాగా కలిసొస్తుందని అభిప్రాయపడుతున్నారు ట్రేడ్ పండితులు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## కియారా అద్వానీ హెుయలు



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ కియారా అద్వానీ. ఈ భామ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో పోషిస్తున్న గేమ్‌ఛేంజర్. శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. నవంబర్ 9న లక్నోలో గేమ్ ఛేంజర్ టీజర్ గ్రాండ్‌గా లాంచ్ చేయబోతున్న విషయం తెలిసిందే. నవంబర్ 9న మూడు రాష్ట్రాలు 11 థియేటర్లలో సాయంత్రం 4:30 గంటల నుంచి సెలబ్రేషన్స్ ఉండబోతున్నాయని తెలియజేశారు. మరోసారి టీజర్ డేట్ గుర్తు చేస్తూ కియారా అద్వానీ లుక్ విడుదల చేశారు మేకర్స్. నీలం రంగు కాస్ట్యూమ్స్‌లో హెుయలుపోతూ అందాలు ఆరబోస్తున్న లుక్ నెట్టింట హల్‌చల్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ చిత్రంలో రాజోలు సుందరి అంజలి మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ మూవీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## నిన్ను బతకనివ్వం

### సల్మాన్‌ఖాన్‌కు మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్

సల్మాన్ ఆప్త మిత్రుడు, ఎన్సీపీ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ అనంతరం బిష్ణోయ్ గ్యాంగ్ సల్మాన్ ఖాన్‌ని టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు సల్మాన్‌కి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసిన వరుస బెదిరింపు కాల్స్ ఇబ్బంది పెడుతున్నాయి. తాజాగా మరోసారి సల్మాన్‌కి ఛాలెంజ్ విసురుతూ ముంబై ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కి కాల్ చేశారు. ఇంతకీ వాళ్ళు ఏమన్నారంటే.. సల్మాన్ ఖాన్-లారెన్స్ బిష్ణోయ్ ఈ చర్చ దేశంలో సంచలనం సృష్టిస్తుంది. ఈ క్రమంలోనే చాలా మంది రెండు వర్గాలుగా చీలిపోయి కొందరు సల్మాన్‌కి మరికొందరు బిష్ణోయ్ గ్యాంగ్‌కి సపోర్ట్ చేస్తున్నారు. అయితే సల్మాన్ ఖాన్‌ని సపోర్ట్ చేస్తూ ఒక గేయ రచయిత పాట రాశారు. ఇందులో లారెన్స్ బిష్ణోయ్ పేరును కూడా ప్రస్తావించడంతో కొందరు ముంబై ట్రాఫిక్ పోలీసులకు కాల్ చేశారు. ఆ పాట రాసిన గేయ రచయిత నెల రోజుల్లో దారుణమైన పరిస్థితి ఎదురుకోవాల్సిందని, ముందులాగ రచనలు చేయలేరని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు. ఇక సల్మాన్‌కి దమ్ముంటే సదురు రచయితకి ఎం కాకుండా కాపాడుకోవాలిని ఛాలెంజ్ విసిరారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మరోవైపు సల్మాన్ ఖాన్‌ని వరుస బెదిరింపు కాల్స్‌తో ఆందోళనపరిచిన కొందరు ఇప్పుడు 'షారుఖ్ ఖాన్'ని టార్గెట్ చేశారు. ఎవరు ఊహించని విధంగా ఇప్పుడు కొందరు బాలీవుడ్ 'బాద్ షా' షారుఖ్‌ని టార్గెట్ చేశారు. చంపేస్తామని కాల్ చేసి బెదించారు. దీంతో పోలీసులు యాక్షన్‌లోకి దిగారు. దీంతో ముంబైలోని బాంద్రా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే ఈ కాల్ చేసింది ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ నివాసి ఫైజాన్‌గా గుర్తించినట్లు తెలిసింది. అయితే మూలలను గుర్తించిన పోలీసులు రాయ్‌పూర్ లో విచారం చేపట్టారు. కాగా, బాబా సిద్ధిఖీ, షారుఖ్, సల్మాన్‌ల మధ్య మంచి స్నేహం ఉంది.





## ప్రభాస్‌తో మరో మూడు భారీ సినిమాలు అధికారికంగా ప్రకటించిన హెూంబలే ఫిల్మ్స్

ప్రభాస్ కెరీర్‌లో బాహుబలి హిట్ తర్వాత కొన్ని రోజులు ఫ్లాప్స్ సతమతయ్యాడు. ఒక్క బ్లాక్ బస్టర్ హిట్ ఇవ్వండి ఎవరైనా అంటూ డార్లింగ్ ఫ్యాన్స్ కసి తీరా కోరుకున్నారు. ఆ క్రమంలోనే వచ్చిన మూవీ 'సలార్'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కాటేరమ్మ జాతర చేసి కలెక్షన్ల బ్లడ్ సునామీని సృష్టించింది. తర్వాత ప్రభాస్ 'కల్కి'తో మరో బ్లాక్‌బస్టర్ అందుకొని టాలెంటెడ్ డైరెక్టర్లతో వరుస సినిమాలు చేస్తుండటంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఆనందంలో మునిగిపోయారు. ఈ ఆనందాన్ని రెట్టింపు చేస్తూ.. 'సలార్' మూవీ నిర్మాతలు అదిరిపోయే అప్డేట్ అందించారు. అది 'సలార్ 2' గురించేమో అని భ్రమపడకండి, అంతకు మించిన అప్డేట్. ఇంతకీ ఆ అప్డేట్ ఏంటంటే.. ప్రభాస్ కెరీర్ కాస్త ఇబ్బందులో ఉన్నపుడు డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హెూంబలే ఫిల్మ్స్ నిర్మించిన 'సలార్' సినిమా ఎంత రిలీఫ్ ఇచ్చిందో అందరికి తెలిసిందే. అయితే మరోసారి ప్రభాస్ ఫ్యాన్స్‌కి బిగ్ ట్రీట్ ఇవ్వడానికి హెూంబలే ఫిల్మ్స్ ఎవరు ఊహించని ప్లాన్ చేసింది. ప్రభాస్‌తో ఏకంగా వరుసగా మూడు సినిమాలు ప్లాన్ చేసింది. ఈ మూడు సినిమాలని 2026, 2027, 2028లలో రిలీజ్ చేయనున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించింది. 'సలార్ 2' రిలీజ్‌తో ఈ జర్నీ ప్రారంభం అవుతుందని తెలిపింది.

Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written